క్లుప్తంగా

వాడవాడలా సెమీ క్రిస్మస్ వేడుకలు



కారెంపూడి: మండలంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం మండలంలోని అన్ని చర్చిలలో ఘనంగా జరిగాయి. క్రీస్తు జనన వృత్తాంతాన్ని అలాగే క్రీస్తును స్తుతిస్తూ విశ్వాసులు గీతాలాపనలు చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కారెంపూడి లూథరన్ చర్చిలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వేలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఇదిలా ఉంటే వాడవాడలా క్రిస్మస్ స్టార్లు మెరిసిపోతున్నాయి. చర్చిలు కూడా విద్యుద్దీపాలంకరణలతో కాంతులీనుతున్నాయి.

సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎన్నిక

కారెంపూడి: కారెంపూడి ఓ అండ్ ఎం సబ్ డివిజన్ పరిధిలోని ఏడు మేజర్ కాల్వల సాగు నీటి సంఘాల అధ్యక్షుల ఎన్నిక శనివారం సాయంత్రం పూర్తయింది. ఈ ఎన్నికలను వైఎస్సార్ సీపీ బహిష్కరించడంతో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షుల వివరాలను అధికారులు ఆదివారం ప్రకటించారు. మిరియాల-1 మేజర్‌కు కొనకంచి పూర్ణచంద్రరావు, మిరియాల-2కు దొడ్డా రమణ, రామాపురంకు పంగులూరి అంజయ్య (నీళ్ల), పెదకొదమగుండ్లకు కోదాటి పోలయ్య, చింతపల్లికి పంగులూరి అంజయ్య, పెదగార్లపాడుకు మల్లా సాంబశివరావు, చినగార్లపాడు మేజర్‌కు నంధ్యాల శ్రీనివాసరెడ్డి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏవో యలమందారెడ్డి, ఏఈలు హేమ, బండారు వెంకటేశ్వర్లు, యరపతినేని రామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ వ్యవహరించారు.

యరపతినేని లక్ష్మయ్య సేవలు అభినందనీయం

రెంటచింతల: పల్నాడు ప్రాంతంలో టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి యరపతినేని లక్ష్మయ్య చేసిన సేవలు అభినందనీయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మంచికల్లు గ్రామంలో లక్ష్మయ్య కుమారుడు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన లక్ష్మయ్య విగ్రహాన్ని ఆయన గురజాల ఎమ్మెల్యేతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. మూడు తరాలుగా మా రెండు కుటుంబాలకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. విలువలకు ప్రాధాన్యతను ఇచ్చి నీతి, నిజాయితీ కలిగిన ఒక మంచి రాజకీయ నాయకుడిగా... రాజకీయ చాణక్యుడిగా పేరు పొందిన లక్ష్మయ్యను పల్నాడు ప్రజలు పెద్దాయనగా పిలుచుకుంటారన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ పెద్దాయన లక్ష్మయ్యగారి ఆశీస్సులు మీ అందరిపై ఉంటాయని ఆయన ఆశయాలను మీరందరూ ముందుకు తీసుకుపోవాలన్నారు. మీకు ఏ సమస్య వచ్చినా ఒకరం కాదు ఇద్దరం ఎప్పుడూ అండగా ఉంటామన్నారు.

మహాకరుణ శాఖాహార ర్యాలీ



గురజాల రూరల్ : ప్రతి ఒక్కరూ శాఖాహారం స్వీకరించాలి.. జంతువులను ప్రేమించాలనే నినాదంతో మహాకరుణ శాఖాహార ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పత్రీజీ ధ్యాన, పిరమిడ్ ఆధ్వర్యంలో మహాకరుణ శాఖాహార ర్యాలీ ఆదివారం గురజాలలో నిర్వహించారు. జంతువులను ప్రేమించి జంతువులు స్వేచ్ఛగా తిరిగేలా చూడాలన్నారు. అహింస.. శాఖాహార నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ప్రాణి స్వేచ్ఛగా జీవించాలి. జీవులు ఎక్కడైతే హింసకు గురవుతాయో అక్కడ మానవాళి మనుగడకు ముప్పు ఉంటుందని.. శాఖాహారం అమృతహారం అంటూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని నినాదాలతో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మాంసాహారం వీడి శాఖాహారం తీసుకోవాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ విమల, పిరమిడ్ సేవాదళ్ ప్రెసిడెంట్ భూపతి రాజు, సీనియర్ పిరమిడ్ మాస్టర్ గాంధీ, నాగార్జునసాగర్ పిరమిడ్ మాస్టర్ సతీష్ బాబు, పల్నాడు పిరమిడ్ మాస్టర్ మణి తదితరులున్నారు.

అక్రమ మట్టి తవ్వకాలు ఆపాలి

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో అక్రమంగా మట్టి తవ్వకాలను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని సత్తెనపల్లి తదితర ప్రాంతాలకు తరలిస్తూ.. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మట్టి తరలించే ట్రాక్టర్లు రైల్వే బ్రిడ్జి గుండా పోతున్నా.. రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. మండల స్థాయి అధికారులు కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అక్రమ తవ్వకాలను అరికట్టాలని బ్రాహ్మణపల్లి ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల

- ఉత్సాహంగా సిడిమాను గ్రామోత్సవం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



విద్యుత్ కాంతులలో పోలేరమ్మ అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్లో) మంచికల్లు పోలేరమ్మ అమ్మవారు

మంచికల్లు(రెంటచింతల): పల్నాటి కోనసీమగా పేరు పొందిన మండలంలోని మంచికల్లు గ్రామంలో ఆదివారం పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు నేతృత్వంలో వేకువజాము నుంచి గ్రామ దేవత అయిన పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా గ్రామస్తులు దేవాలయంలోని అమ్మవారిని సందర్శించుకొని మొక్కులు చెల్లించుకుని అమ్మవారి దీవెనలు పొందారు. ఆలయం వద్ద నుంచి గ్రామ పురవీధులలో సిరులు కురిపించే సిడిమాను మహోత్సవంను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించగా చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా గ్రామస్తులందరూ ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి, హారతులతో సిడిమానుకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. సిడిమానును తిలకించి తమ కుటుంబాలకు అంతా మంచి జరగాలని పోలేరమ్మ తల్లి పాదాల చెంతకు చేరారు. ధాన్యం ఇంటికి చేరడంతో పాటు కొత్త అల్లుళ్లు, బంధు మిత్రులతో ప్రతి ఇంట ఆనందం వెల్లివిరిసింది. పోలేరమ్మ దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున నేతృత్వంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం గ్రామంలో కుంకుమ బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. మంచికల్లు తిరునాళ్ల సందర్భంగా ఆదివారం పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో పోలేరమ్మ అమ్మవారిని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఆర్వో మురళి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, గురజాల డీఎస్పీ జగదీష్ తహసీల్దార్ కె.నగేష్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులందరూ శాంతి, సుఖ సంతోషాలతో జీవించేలా పోలేరమ్మ అమ్మవారు కరుణించి ఆశీస్సులు అందించాలని కోరుకున్నారు.



గ్రామంలో ఉల్లాసంతో సిడిమాను మహోత్సవాన్ని నిర్వహిస్తున్న గ్రామస్తులు



పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు

వైభవంగా పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల

- బారులు తీరిన భక్తులు
- ఉత్సాహంగా సిడిమాను ఉత్సవం



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గురజాల: పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. మొక్కుబడులు చెల్లించుకుని పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. మండలంలోని ప్రజలు ఉత్సవంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించారు. లడ్డూ ప్రసాదాన్ని దేవాలయ కమిటీ నిర్వాహకులు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తు, దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టారు. అమ్మవారిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు , జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీఆర్వో మురళీ, ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దార్ కె.నగేష్ తదితరులు దర్శించుకున్నారు.అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కనుల పండువగా సిడిమాను ఉత్సవం

సాయంత్రం సమయంలో సిడిమాను ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సిడిమాను ఉత్సవాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ముదికొండ పూర్ణచంద్రరావు, కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.నగేష్ కొబ్బరికాయలు కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం సిడిమానును గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. రైతులు పండించిన పంటలు, కూరగాయలతో సిడిమానును ప్రత్యేకంగా అలంకరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ ఆవుల భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐ వై.వినోద్ కుమార్ తదితరులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, నవులూరి శ్రీరామమూర్తి, పి.కాంతరావు, బుల్లయ్య, తదితరులున్నారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రాజు

రెంటచింతల: మండలంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు 2023-24 సంవత్సరానికి మండలంలోని వివిధ గ్రామాలలో చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్వహిస్తున్న 16వ విడత సామాజిక తనిఖీలు చేపడుతున్న బృందాలకు క్షేత్ర స్థాయి సిబ్బంది సహకరించాలని ఎస్ఆర్‌పీ రాజు కోరారు. ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల సిబ్బంది, సోషల్ ఆడిట్ డీఆర్పీలు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ కె.సరోజినిదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. తనిఖీ బృందాలకు సహకరించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీఓ జయచంద్రకుమార్, కార్యదర్శులు, ఎఫ్ఏలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరలు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



రెంటచింతల ప్రధాన సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలో...



రెంటచింతల రామాలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి



అమరజీవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కారెంపూడి: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం నిర్వహించారు. అమరజీవి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి కొబ్బరి కాయలు కొట్టి నివాళులర్పించారు. ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇమ్మడి వీరేశ్వరరావు, సూరె అంకారావు, కొలిశెట్టి మల్లిఖార్జునరావు, చీతిరాల కోటేశ్వరరావు, భవిరిశెట్టి రామారావు, కజ్జం ఆంజనేయులు, రామాంజి, యక్కల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

రెంటచింతల: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, వైఆర్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొక్కెండ్ల బ్రహ్మం అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని రెంటచింతలలో ప్రధాన రహదారి వెంబడి, స్థానిక రామాలయం వద్ద, పాలువాయి గ్రామ ప్రధాన సెంటర్‌లో నున్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు వారు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు త్యాగాన్ని నేటి యువత స్మరించుకుని ఆయన బాటలో నడవాలన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని మండల అభివృద్ధి అధికారి కె.సరోజినిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. 58 రోజులు పాటు అమరణ నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడని కొనియాడారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఎస్.పుల్లారెడ్డి, రామకృష్ణ గురుకులం హెచ్ఎం శ్రీనివాస్, నాళం చిన్నబాబు, పెద్దబాబు, గుండా రామ్మూర్తి, ఎం.మల్లిఖార్జునరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరై పొట్టి శ్రీరామలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

పొట్టి శ్రీరాములు వర్ధంతిని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ సిబ్బంది నిర్వహించారు. సిబ్బంది కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి నడుము బిగించాలి

టీటీడీ బోర్డుమెంబర్ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: శివాలయం పునః నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుము బిగించాలని టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో ఆదివారం నాయకురాలు నాగమ్మ నూతన దేవాలయ నిర్మాణంపై సమావేశం జరిగింది. గామాలపాడులో నిర్మించ తలబెట్టిన దేవాలయం పనులపై సుదీర్ఘంగా చర్చించారు. జంగా మాట్లాడుతూ ఎంతో పురాతనమైన అతి పవిత్రమైన శివాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ దేవాలయం పునఃనిర్మాణానికి అందరూ సహాయ సహకారాలతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంతో పాటు దాతలు కూడా ఈ దేవాలయం నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు. పల్నాడు ప్రాంతంలో భక్తి విరజిల్లేలా, ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఈ దేవాలయ నిర్మాణం ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చారు.

రాహు-కేతు పూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరుని ఆలయంలోని రాహు-కేతువులను పూజిస్తే సర్వదోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. దీంతో సమీప గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సమేతంగా సామూహిక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతువును విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

పచ్చ పైత్యం



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రం, పర్యాటక కేంద్రమైన అమరావతిలో ప్రజల సౌకర్యార్థం సుమారు 20 ఏళ్ల క్రితం మెయిన్ రోడ్డు మధ్యలో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు డివైడర్ ఏర్పాటు చేశారు. దానికి ప్రస్తుతం పసుపు రంగు వేయడం పలు విమర్శలకు తావిస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి ఆర్ అండ్ బీ రహదారి కావటంతో జీబ్రా లైన్‌లకు వేసే నలుపు, తెలుపు రంగులను వాడేవారు. ప్రస్తుతం పసుపు రంగు వేయడంపై గ్రామస్తులు ఇలాంటి చర్యలు మంచివి కాదని చర్చించుకుంటున్నారు.

వైభవంగా దత్త జయంతి



సత్యసాయి ప్రేమ మందిరంలో దత్త జయంతి

విజయపురిసౌత్: స్థానిక సత్యసాయి ప్రేమ మందిరంలో దత్త జయంతి వేడుకలు ఆలయ ధర్మకర్తలు కె.సాయి హరిప్రసాద్, వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు హనుమాచారి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 5:15 గంటలకు స్వామి వారికి కాకడ హారతి, 6 గంటలకు సాయిబాబా మంగళస్నానం నిర్వహించారు. 11 గంటలకు స్వామి వారికి పల్లకిలో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భజన మండలి సభ్యులచే సాయి ఏకాహం నిర్వహించారు. మధ్యాహ్నం 2000 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఆవల సత్యనారాయణ, రిటైర్డ్ తహసీల్దార్ నర్సింహారావు, ములకా జానారెడ్డి, గొంతిన సాయిరాం, జీవీజీ కృష్ణమూర్తి, రామకృష్ణ, పవన్‌కుమార్, సుధాకర్, నాగరాజు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుదత్త జయంతి

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుదత్త జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహానికి పల్లకిలో స్వామివారి దేవస్థానం నుంచి జానపాడు రోడ్డులోని ఐలాండ్ సెంటర్ మీదుగా పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అలాగే భక్తులు ఊరేగింపులో భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు స్వామి వారి ఊరేగింపులో కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు శ్రీరాం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



స్వామి వారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు



స్వామి వారి ఊరేగింపులో మహిళల కోలాటం

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు



ఉపాధ్యాయులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ స్కూల్‌లో ఆదివారం ఎస్టీయూ పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో మణిపాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సమరసింహారెడ్డి, డాక్టర్ డి.కోటేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించి ఈసీజీ, షుగర్, టూడీ ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 170 మంది ఉపాధ్యాయులు ఉచితంగా వైద్య సేవలను పొందారు. పల్నాడు జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు ఎల్‌వీ రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైద్య సేవలు అందించిన మణిపాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్ బీఎస్ రాజు, ఏరియా కార్యదర్శి ఎ.రామలింగయ్య, పిడుగురాళ్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, జి.పుల్లారావు, సీహెచ్ శంకర్‌నారాయణ, జీఆర్ శ్రీనివాసరావు, ఆర్.వెంకటరెడ్డి, కె.విజయబాబు, జి.వెంకటేశ్వరరావు, ఎన్.ఏడుకొండలు, యు.చెన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ ఏసురత్నం, బి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటరమణలు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబయిన బాప్టిస్ట్ చర్చి



నగర పంచాయతీ పరిధిలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిని అందంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ నేపథ్యంలో చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. చర్చి టవర్‌పై క్రిస్మస్ స్టార్‌ని ఏర్పాటు చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రతి రోజు తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ తగరం ప్రేమయ్య, సంఘ పెద్ద నాగెండ్ల రత్నం తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా విశ్వాసులకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు వారు చెప్పారు.

- దాచేపల్లి

యోగా సాధనతో మనస్సు ప్రశాంతం

నరసరావుపేట ఈస్ట్: ఉత్తమ జీవనానికి యోగా సాధనమని మంగళగిరి శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం ప్రధానాచార్యులు డాక్టర్ వేంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 28 రోజుల పాటు నిర్వహించిన 181వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని మాగులూరి బిల్డింగ్ అక్షర పాఠశాల ఆవరణలో ఆనందోత్సవం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న అభ్యాసకులనుద్దేశించి డాక్టర్ వేంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ, ఓంకారంతో మొదలయ్యే యోగ సాధనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. అసూయ, రాగద్వేషాలకు అతీతంగా పాపకర్మలను విడనాడి సత్కర్మలను చేయటం అలవడుతుందని వివరించారు. అభ్యాసకులు ప్రతిరోజు శిబిరంలో తాము నేర్చుకున్న ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామం ఆచరించాలని ఆయన తెలిపారు. శిబిరానికి పూర్తిస్థాయిలో హాజరైన వారికి బోధక యోగాచార్యుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అతిథులు జ్ఞాపికలు అందించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ కృష్ణ ప్రసాదు, స్వామి స్కూల్ డైరెక్టర్ ఇ.ఎం.స్వామి, మాగులూరి రమణారెడ్డి, వెంగళరెడ్డి, కాపుగంటి శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి బిఎల్వీ శేషాద్రి



గురజాల : లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసుల నుంచి విముక్తి పొందాలని సీనియర్ సివిల్ జడ్జి బిఎల్వీ శేషాద్రి కోరారు. స్థానిక కోర్టు భవనంలో ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది లీటర్ల పరిధిలో లిక్కర్ తరలింపు బీర్లు పట్టుబడిన కేసులో వాటి విలువకు మూడు లేదా ఐదు రెట్లు వరకు చెల్లించి కేసును తీసివేసే విధంగా చూడాలన్నారు. ఈ విషయాన్ని కక్షిదారులకు అవగాహన కల్పించి కేసులను రాజీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.